

మంతూర్‌లో కోలాటం ఆడుతున్న దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

# బీఆర్‌ఎస్‌కు మళ్లీ పట్టం కట్టాలి

- సంక్షేమ పథకాలు కొనసాగాలంటే గులాబీ పార్టీని గెలిపించాలి
- కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లే
- కాంగ్రెస్. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పథకాలు ఎందుకు లేవు
- రైతుల మోటర్లకు మీటర్లు పెట్టాలని బీజేపీ యత్నం
- రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- తెలంగాణలో 24 గంటల కరెంట్, పుష్కలంగా సాగు,తాగునీరు
- మోసగాళ్లను నమ్మితే గోసపడతాం
- ఆశీర్వదించి గెలిపిస్తే నిరంతరం సేవచేస్తా
- దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి
- రాయపోల్ మండలంలో ఎన్నికల ప్రచారం
- పల్లెల్లో ప్రభాకర్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు



బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి మెదక్ ఎంపీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చిన్నమసాన్‌పల్లి కార్యకర్తలు

రాయపోల్,అక్టోబర్ 28: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రజలు మళ్లీ బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాయపోల్ మండలంలోని మంతూర్, అనాజీపూర్, చౌదరిపాలెం, చిన్నమాసాన్‌పల్లి, లింగారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మొదట మంతూర్ గ్రామస్తులు ఆయకు బ్రహ్మరథం పట్టారు. అనంతరం చౌరస్తాలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓట్లు వేస్తే ఆగమైపోతామని, కరెంట్, నీటి కష్టాలు తప్పవన్నారు. రాష్ట్రంలో ముడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రగతి ఫలాలు అందాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రాష్ట్రాన్ని సుభిక్షంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎన్నికల్లో దుబ్బాకలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ నాడు పోరాటం చేసి తెలంగాణ సాధించాడని గుర్తుచేశారు. నేడు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఆదర్శంగా గుర్తింపు వచ్చాయన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి మహిళలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు గుర్తుచేశారు. రైతుల వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టాలని బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. మహిళలకు రూ.400 గ్యాస్ సిలిండర్ అందిస్తామని, కాంగ్రెస్ పార్టీది కుర్చీలాట, బీజేపీ మతరాజకీయమని, కానీ బీఆర్‌ఎస్ ప్రజా సంక్షేమమే లక్ష్యమన్నారు. పదేండ్లు మెదక్ ఎంపీగా గెలిపించారని, ఈ సారి దుబ్బాకలో ఎమ్మెల్యేగా ఆశీర్వదించి గెలిపిస్తే సిద్దిపేట, గజ్వేల్‌కు ధీటుగా దుబ్బాక నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## మోసగాళ్లను నమ్మితే గోసపడతాం

ఎన్నికల సమయంలో వచ్చే మోసగాళ్లను నమ్మితే గోసపడతామని, గత ఉప ఎన్నికల్లో మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని ఎమ్మెల్యే రఘునందర్‌రావు ప్రజలకు చేసిందేమీలేదని ఆయన విమర్శించారు. ఢిల్లీకి గులాంగిరి చేసే పార్టీలతో అభివృద్ధి జరగదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లప్పుడు ప్రజా శ్రేయసుకోసం ప్రజలకు అందుబాటులో ఉండి పథకాలు అందిస్తూ అండగా ఉంటారన్నారు.

## కొత్త ప్రభాకర్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

రాయపోల్ మండలంలో మొదటి విడతలో భాగంగా గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. భారీ సంఖ్యలో మహిళలు బోనాల ఉరేగింపులు, బతుకమ్మ ఆటలు, యువకుల నృత్యాలు, ముదిరాజ్‌ల జలకడువలు, దారిపొడవునా డప్పు చప్పులు, పూల వర్షాలు కురిపించారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

మండలంలోని అంకిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రాజిరెడ్డితో పాటు 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కొత్త ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. చిన్నమాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన యవకులు కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, రాయపోల్ మండల ఇన్‌చార్జి వెంకట్‌నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, జడ్పీటీసీ యాదగిరి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు పర్వేజ్, సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ పడకంటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ యువజన నాయకులు స్వామి, దయాకర్, రాజిరెడ్డి, పాల రామాగౌడ్, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, శ్రీధర్, రామచంద్రంగౌడ్, వెంకట్‌గౌడ్, సత్యం, భుజ్జి పాల్గొన్నారు.



రాయపోల్ మండలం చౌదరిపాలెంలో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి




రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లిలో బతుకమ్మలతో ఎంపీకి స్వాగతం పలుకుతున్న మహిళలు

# నయవంచన కాంగ్రెస్.. తడిగుడ్డతో గొంతు కోశారు

# హస్తవ్యస్తం

## కాంగ్రెస్ పార్టీ తీరుపై మండిపడుతున్న శ్రేణులు

- డబ్బు సంచులు ఇచ్చినోళ్లకే పార్టీ టికెట్లు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అసంతృప్తి సెగలు
- రగిలిపోతున్న నాయకులు, కార్యకర్తలు
- రేవంత్‌రెడ్డిపై దుమ్మెత్తిపోస్తున్న పార్టీ నేతలు
- టికెట్ రాని నేతలంతా అనుచరులతో సమావేశాలు
- పొన్నంకు సహకరించేది లేదని సూటిగా చెప్పిన ప్రవీణ్‌రెడ్డి
- నర్సాపూర్‌లో అసంతృప్తి నేతల సమావేశం
- స్వతంత్రంగా బరిలోకి దిగేలా కార్యాచరణ
- పార్టీ అభ్యర్థులను ఓడించడమే లక్ష్యం
- 11 స్థానాలకు తొమ్మిది స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన
- నారాయణ్‌ఖేడ్, పటాన్‌చెరు ప్రకటించాల్సి ఉంది




సిద్దిపేట, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్తంగా మారింది. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన అనంతరం ఉమ్మడి జిల్లాలో ఆపార్టీలో అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఆపార్టీ అధినాయకత్వంపై నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఆయన వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టించారని మండిపడుతున్నారు. పార్టీ కోసం అన్ని అమ్ముకొని, కష్టపడి పనిచేస్తే పార్టీలో సరైన గుర్తింపు లేదని వాపోతున్నారు. నమ్మించి మోసం చేశారని ఆరోపిస్తున్నారు. తడి గుడ్డతో గొంతు కోస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికే తొలి విడత జాబితాను ప్రకటించగా శుక్రవారం రెండో విడత జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది స్థానాలతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కలుపుకుంటే మొత్తం 11 స్థానాలు ఉన్నాయి. వీటిలో నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాలు మినహా అన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను ప్రకటించింది. రెండో జాబితాలో సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, నర్సాపూర్, నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించగా తొలి జాబితాలో సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, మెదక్, గజ్వేల్ నియోజకవర్గాల అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈజాబితాలపై కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలతో అట్టుడుగుతున్నది. డబ్బులున్న వారికే ఆ పార్టీ టికెట్లు ఇచ్చిందని పార్టీ నాయకులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. అభ్యర్థుల ప్రకటనతో అన్ని నియోజకవర్గాల్లో అసంతృప్తి రాగాలు.. మిన్నంటుతున్నాయి. పార్టీ కోసం పనిచేసిన నాయకులకు కాకుండా డబ్బు సంచులున్న నాయకులకే టికెట్లు కేటాయించారని తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తూ ఆపార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై మండిపడుతున్నారు. ఎక్కడికక్కడ తమ అనుచరులతో అంతర్గత సమావేశాలు ఏర్పాటు చేసుకొని తమ కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. కొన్నిచోట్ల మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీ అభ్యర్థులకు సహకరించేది లేదని తేల్చి చెబుతున్నారు. మరికొన్ని చోట్ల స్వతంత్రంగా పోటీ చేసే అలోచన సైతం చేస్తున్నారు. మరికొంత మంది నేతలు కార్యకర్తలు ఆపార్టీకి రాజీనామాలు చేస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నది. ఇప్పటికే మెజార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు.

## కాంగ్రెస్‌లో టికెట్లలొల్లి

- నర్సాపూర్ కాంగ్రెల్ లో బయటపడ్డ విభేదాలు
- బ్రోకర్‌కు టికెట్ కేటాయించారంటూ విమర్శ
- పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కకు పెట్టారంటూ ఆరోపణ
- టికెట్ విషయంపై పునరాలోచించాలని డిమాండ్
- టికెట్ కెటాయించకపోతే రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తామంటూ అల్టిమేటం

హత్నూర, అక్టోబర్ 28: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు బయట పడుతున్నాయి. నిన్నమొన్నటి వరకు పార్టీ కోసం పనిచేసిన తమకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ వస్తుందని ఆశించిన అభ్యర్థులకు పార్టీ అధిష్టానం టికెట్ కెటాయించకపోవడంతో తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఎన్నోఏండ్లుగా పార్టీ కోసం పనిచేసిన తమను పక్కనపెట్టి ఇతర పార్టీలకు కోవర్టుగా పనిచేసే వ్యక్తికి టికెట్ కెటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం పార్టీ కోసం పనిచేసే వారిని గుర్తించి టికెట్ కెటాయించాలని లేనిపక్షంలో రెబల్ అభ్యర్థిగానైనా పోటీలో ఉంటామని హెచ్చరించారు. శనివారం హత్నూర మండలం సాదుల్లానగర్ శివారులోని ఓ ఫాంహౌస్‌లో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిమానంతో ఎన్నోఏండ్లుగా పార్టీని నియోజవకర్గంలో బలోపేతం చేశామన్నారు. పార్టీ అధిష్టానం ఎప్పుడు పిలుపునిచ్చినా గ్రామస్థాయిలో కార్యకర్తలను ఏకంచేసి కార్యక్రమాలను విజయవంతం చేసినట్లు తెలిపారు. త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కెటాయిస్తుందని భావించినప్పటికీ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఇతర పార్టీలకు కోవర్టుగా పనిచేసే వ్యక్తికి టికెట్ కెటాయించడం ఏంటని ప్రశ్నించారు. ఏనాడూ పార్టీ కోసం పనిచేయని ఆవుల రాజిరెడ్డికి టికెట్ ఎలా కెటాయిస్తారని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు కొందరిని ఇతర పార్టీకి మద్దతు ఇప్పించి బ్రోకర్ పనిచేసిన వ్యక్తికి ఏవిధంగా టికెట్ కెటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచన చేసి తమ ముగ్గురిలో ఎవరికైనా టికెట్ కెటాయించాలని, లేనిపక్షంలో రెబల్ అభ్యర్థిగా బరిలో వుంటామని హెచ్చరించారు. త్వరలో ప్రకటించబోయే మూడో లిస్టులో నర్సాపూర్ అభ్యర్థిని మార్చాలని లేనిపక్షంలో గ్రామగ్రామాన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను ఏకం చేసి బరిలో నిలుస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హత్నూర మండలం సాదుల్లానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి



## అసంతృప్తితో రగిలిపోతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తీరు అగమ్యగోచరంగా మారింది. పార్టీ అభ్యర్థుల ప్రకటన అనంతరం ఆ పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డికి మరోసారి కాంగ్రెస్ అధిష్టానం మొండి చెయ్యి చూపింది. ఆయన 2009 ఎన్నికల్లో హుస్నాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీపై పోటీచేసి విజయం సాధించి ఎమ్మెల్యేగా సేవలను అందించారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2018 ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా హుస్నాబాద్ స్థానాన్ని సీపీఐకి కేటాయించడంతో ఆయనకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం అనుహ్యంగా కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించడంతో ప్రవీణ్‌రెడ్డి మండిపడుతున్నారు. కాంగ్రెస్ టికెట్ ఇస్తామంటూ మోసం చేసిందని ఆయన వర్గీయులు పార్టీపై తీవ్ర ఆగ్రం వ్యక్తం చేస్తునారు. పార్టీ నమ్మక ద్రోహం చేసిందని ఆయన వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. నయవంచన కాంగ్రెస పార్టీఅని తడిగుడ్డతో గొంతు కోసంది అని కార్యకర్తలు మండిపడ్డారు. రెండు మూడు రోజుల్లో స్వతంత్రంగా పోటీ చేయడమా.? పార్టీకి రాజీనామా చేయడమా..? అనేది నిర్ణయం తీసుకోనున్నారు. శనివారం ఉదయం ప్రవీణ్‌రెడ్డి ఇంటికి హుస్నాబాద్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ వెళ్లి కలిశాడు. ప్రవీణ్‌రెడ్డి తీవ్ర అసంతృప్తితో రగిలిపోయినట్లు సమాచారం.. ఎట్టి పరిస్థితుల్లోనూ మీకు సహకరించేది లేదని చెప్పినట్లు సమాచారం.

## మెదక్ జిల్లాలోనూ..


మెదక్ జిల్లా నర్సాపూర్ టికెట్‌ను డబ్బులకు అమ్ముకుందని ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు. ఇక్కడ ఆవుల రాజిరెడ్డిని ప్రకటించడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు అసంతృప్తి నేతలైన గాలి అనీల్‌కుమార్, ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి హత్నూరలో మీడియా సమావేశంలో కాంగ్రెస్ అధిష్టానంపై మండిపడ్డారు. పార్టీ అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. మార్చకపోతే తాము బరిలో ఉంటామని అధిష్టానాన్ని హెచ్చరించారు. మెదక్ కాంగ్రెస్ అభ్యర్థిగా మైనంపల్లి రోహిత్‌రావును ప్రకటించడంపై అక్కడి పార్టీ నేతలు ఆపార్టీకి రాజీనామాలు చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి నేత మ్యాడం బాలకృష్ణ ఉన్నారు. సంగారెడ్డి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డికి టికెట్ కేటాయించారు. ఇక్కడ పొన్న శేఖర్‌గౌడ్, సంగమేశ్వర్‌తో పాటు మరికొంత మంది తీవ్ర అసంతృప్తి నేతలు ఉన్నారు. మరికొంత మంది బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. ఆందోల్‌లో కాంగ్రెస్ నుంచి దామోదర రాజనర్సింహకు టికెట్ కేటాయించారు. జహీరాబాద్ నుంచి మాజీ మంత్రి చంద్రశేఖర్‌కు టికెట్ ఇచ్చారు. దీనిని వ్యతిరేకిస్తూ పలువురు ఆ పార్టీకి రాజీనామాలు చేసి ఇతర పార్టీల్లో చేరారు. దుబ్బాక నుంచి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ కేటాయించారు. ఇక్కడ కత్తి కార్తీకగౌడ్, పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డి టికెట్ కోసం ఆశించి భంగపడ్డారు. వీరు తమ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఇక్కడ మాజీ ఎమ్మెల్సీ మాదాడి రంగారెడ్డి కుమారుడు జశ్వంత్‌రెడ్డి రెండు రోజుల కిందట ఇతర పార్టీలో చేరిపోయారు. యువనేత శ్రీకాంత్‌రావు కాంగ్రెస్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికే చాలా మంది ఆపార్టీకి రాజీనామాలు చేసి బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. సిద్దిపేట నుంచి పూజల హరికృష్ణకు టికెట్ ఇవ్వడంపై సీనియర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పార్టీ కోసం డబ్బులు ఖర్చు చేసిన తమకు టికెట్ ఇవ్వలేదని వారు వాపోతున్నారు. ప్రధానంగా దరిపల్లి చంద్రం, తాడూరి శ్రీనివాస్‌గౌడ్, గూడూరి శ్రీనివాస్ తదితర నేతలు అసంతృప్తితో ఉన్నారు. ఇదిలా ఉంటే ఇంకా రెండు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఖరారు చేయలేదు. పటాన్‌చెరు నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో కాట శ్రీనివాస్, సపాన్‌దేవ్‌తో పాటు నిన్ననే చేరిన నీలం మధు, నారాయణఖేడ్ నుంచి సురేష్ శెట్కార్, సంజీవరెడ్డి, దేవునూరి లక్ష్మణ్ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఏది ఏమైనా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతు కావడం ఖాయంగా కనిపిస్తుంది.



భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరులతో మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

# హుస్నాబాద్ కాంగ్రెస్‌లో ముసలం

- కాంగ్రెస్ నమ్మించి గొంతు కోసింది
- ఐదేండ్ల పాటు ఎమ్మెల్యేగా.. మరో ఐదేండ్లు కార్యకర్తలకు అండగా ఉన్నా
- టికెట్ ఇవ్వకపోవడం బాధాకరం
- నయవంచన చేసిన కాంగ్రెస్ తీరుపై కార్యాచరణ ప్రకటిస్తా
- కాంగ్రెస్ అధిష్టానంపై మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మండిపాటు
- ముల్కనూరులోని తన నివాసంలో కార్యకర్తలు, అభిమానులతో సమావేశం



హుస్నాబాద్, అక్టోబర్ 28: కాంగ్రెస్ పార్టీ నమ్మించి గొంతుకోసిందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తన ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ కాంగ్రెస్ టికెట్‌ను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు ఖరారు చేయడంతో శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని తన నివాసంలో ఆయన ఏడు మండలాల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడే స్వయంగా టికెట్ వస్తుందని చెప్పి అనంతరం మోసం చేశాడన్నారు. 15నెలలుగా నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీక్యాడర్‌ను ఐక్యం చేశానన్నారు. ఐదేండ్ల పాటు ఎమ్మెల్యేగా.. మరో ఐదేండ్లు పాటు కార్యకర్తలకు అండగా ఉన్నానని గుర్తుచేశారు. నియోజకవర్గానికి సంబంధం లేని వారికి టికెట్ ఖరారు చేసి నాకు, నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్టానానికి స్థానికంగా ఉండే నాయకులు అసమర్థులుగా, స్థానికేతరులు సమర్థులుగా కనిపిస్తున్నారా అని ప్రశ్నించారు. పార్టీ అధిష్టానం తీరుతో కార్యకర్తలు, నాయకుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. నయవంచన చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎలా గుణపాఠం చెప్పాలో రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## ప్రవీణ్‌రెడ్డి ఇంటికి వెళ్లి సపోర్ట్ చేయాలని కోరిన పొన్నం... విముఖత వ్యక్తం చేసిన ప్రవీణ్‌రెడ్డి

కాంగ్రెస్ అధిష్టానంటికెట్ ఖరారు చేయడంతో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ శనివారం అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఇంటికి వెళ్లి మద్దతు ప్రకటించాలని కోరినట్లు సమాచారం. ఇందుకు ప్రవీణ్‌రెడ్డి విముఖత చూపారని తెలిసింది. కార్యకర్తలతో మాట్లాడిన తర్వాత చెప్తానని చెప్పడంతో పొన్నం నిరాశతో వెనుదిరిగారు. పొన్నం ప్రభాకర్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వొద్దని ప్రవీణ్‌రెడ్డి వర్గీయులు తెగేసి చెప్పినట్లు సమాచారం. దీంతో హుస్నాబాద్ కాంగ్రెస్‌లో ముసలం మొదలైంది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌లో చీలికలు రావడం, సగం క్యాడర్ ప్రవీణ్‌రెడ్డి వెంటే ఉండటం వల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గడ్డు పరిస్థితులే ఉంటాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



సమావేశానికి హాజరైన పొన్నం ప్రభాకర్ వ్యతిరేకవర్గం